క్లుప్తంగా

పేద కుటుంబాలకు ఆర్థిక చేయూత

పెడన: పట్టణంలోని ఏడో వార్డులో నివాసం ఉంటున్న పేద కుటుంబాలకు సహాయ ఫౌండేషన్ గురువారం ఆర్థిక సాయం చేసింది. గంజాల భూదేవి, కరిముల్లా, మత్రివాడ లీలావతికి మునిసిపల్ ఫ్లోర్ లీడర్ కటకం ప్రసాద్ చేతుల మీదుగా ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున పంపిణీచేసింది. 40 కిలోల బియ్యం, నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకు లను అందించింది. ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా, పామర్తి శ్రీనివాస్ బాబు, హమీద్ ఖాన్, బళ్ల సాయి, కటకం నాగ కుమార్, రౌతుల ప్రసాద్ ఏకాంబరం, ప్రశాంత్ వినయ్, మస్తాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం దుకాణంలో తనిఖీ

పెడన: రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నాడని ఫిర్యాదు రావడంతో పట్టణంలోని తవుడు, నూకలు, బియ్యం విక్రయించే దుకాణంలో గురువారం పోలీసుల సమక్షంలో సచివాలయ వీఆర్వో, సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. 16వ వార్డులో సిద్దినేని ప్రసాద్ బియ్యం తీసుకుని నూకలు, తవుడు ఇస్తున్నట్లు పెడన పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదుతో దుకాణంలో తనిఖీలు నిర్వహించగా ఎనిమిది బస్తాలు నూకలు, కొంత తవుడుతో పాటు 30 కిలోల రేషన్ బియ్యం లభించింది. ఈ బియ్యం తన తల్లి, తమ్ముడికి చెందినవని దుకాణదారుడు చెప్పడంతో, అతని నుంచి ఆ మేరకు స్టేట్‌మెంటు తీసుకున్నామని సచివాలయ వీఆర్వో భార్గవ్ తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

మచిలీపట్నంటౌన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన వారిలో లక్కీ డిప్ ద్వారా ఎంపికైన విజేతలకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. బస్టాండ్ ఆవరణలో ఈ కార్యక్రమం జరిగింది. విజయవాడ రూట్‌లో ప్రయాణించిన ఎం.కుసుమప్రియ, ఏలూరు రూట్‌లో ప్రయాణించిన సీతారామరెడ్డి, బంటుమిల్లి రూట్‌లో ప్రయాణించిన ఎంఎల్ స్వాతి లక్కీడిప్‌లో విజేతలుగా నిలిచారు. వీరికి డీఎం టి.పెద్దిరాజు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మూడు రూట్లలో ప్రయాణించే వారు తమ టికెట్ల వెనుక పేరు, ఫోన్ నంబర్ రాసి బస్సులో ఉన్న లక్కీ డిప్ డబ్బాలో వేయాలని సూచించారు.

ఆకట్టుకున్న రంగవల్లుల పోటీలు

మచిలీపట్నంటౌన్: వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకుని గురువారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. గొడుగుపేటలోని శంకరమఠం ఆవరణలో నిర్వహించిన ఈ పోటీల్లో 20 మంది మహిళలు రంగురంగుల ముగ్గులను తీర్చిదిద్దారు. ఈ పోటీల్లో బి.అరుణ ప్రథమ, జె.స్వాతి ద్వితీయ, ఎస్.స్వప్న తృతీయ, రత్నమాల చతుర్థ బహుమతులు పొందారు. సుజాత, మాధవీలత, చంద్రకళ, దుర్గమ్మ ప్రోత్సాహక బహుమతులకు ఎంపికయ్యారు. విజేతలకు వాసవీ వనిత క్లబ్ జోన్ చైర్‌పర్సన్ శ్రీకాకోళపు రేణుకారాణి, క్లబ్ ప్రతినిధి వేముల శిరీష, 38వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ శ్రీకాకోళపు నృసింహగుప్తా, కపుల్స్ క్లబ్ అధ్యక్షుడు టి.శ్రీనివాస్ బహుమతులు అందజేశారు.

మృతురాలి కుటుంబానికి పింఛన్‌దారుల ఆర్థిక సాయం



మచిలీపట్నంటౌన్: నగరంలోని 37వ డివిజన్ రాజుపేట చర్చి ప్రాంతంలో నివసించే వృద్ధురాలు రూతమ్మ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆ డివిజన్‌లో ఉన్న సామాజిక పింఛనుదారులు తలా రూ.100 చొప్పున రూ.34 వేలు సేకరించి రూతమ్మ కుమార్తె రామలీలకు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), స్థానిక కార్పొరేటర్ ఐనం తాతారావు తదితరులు రూతమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చిలకలపూడి(మచిలీపట్నం): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠానికి సంబంధించి 2022–23 విద్యా సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డీఈఓ తాహెరా సుల్తానా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తత్కాల్ పద్ధతిన పదో తరగతి విద్యార్థులు రూ.400, ఇంటర్మీడియెట్ విద్యార్థులు రూ. 500 చెల్లించి దరఖాస్తుతో పాటు అందించాలన్నారు. ఆన్‌లైన్‌లో ఈ నెల ఏడో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఓపెన్ స్కూల్స్ జిల్లా కో–ఆర్డినేటర్ బాబూరావును 80084 03506 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రైతులను ఆదుకోవాలని వినతి

మోపిదేవి: రంగుమారిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డెప్యూటీ తహసీల్దార్ శివరామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. సంఘం నియోజకవర్గ కార్యదర్శి అట్లూరి వెంకటేశ్వరావు మాట్లాడుతూ.. తుపానుకు తడిసి, రంగుమారిన ధాన్యాన్ని షరతులు లేకుండా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, రైతు సంఘం నాయకులు మల్లింపాటి కోటేశ్వరావు, బండి రామకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు





అవనిగడ్డలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి; నవరత్న పథకాల లబ్ధిదారునికి బుక్‌లెట్ అందజేస్తున్న పేర్ని కిట్టు

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం లబ్ధిదారుల ఇంటికి చేరేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పేర్కొన్నారు. అవనిగడ్డలోని వీవర్స్‌కాలనీ, ఎస్టీ కాలనీ, బందలాయిచెరువు ప్రాంతాల్లో ఎమ్మెల్యే సింహాద్రి గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ రాష్ట్రంలో గొప్ప మార్పుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఏ సమస్య ఉన్నా మండల కేంద్రాలకు వెళ్లి కార్యాలయాల చుట్టూ తిరగకుండానే గ్రామాల్లోనే పరిష్కారం లభిస్తోందని పేర్కొన్నారు. ఒకటో తేదీన తెల్లవారు జామునే ఇంటి తలుపు తట్టి పింఛన్ ఇవ్వడం దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేదన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు వివరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మరోసారి బ్రహ్మరథం పట్టేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్‌బాషా, ఉపసర్పంచ్ గాజుల జయగోపాల్, పార్టీ నాయకులు సింహాద్రి రామనాథబాబు, చింతలపూడి బాలు, గార్లపాటి గోపీ, మేడికొండ సంతోషరావు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపతో ప్రజాసమస్యల పరిష్కారం

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో ప్రజాసమస్యలు పరిష్కారమవుతున్నాయని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 36వ డివిజన్ రాజుపేటలో ఆయన గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, ఆ డివిజన్ కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్‌తో కలిసి గడప గడపకు వెళ్లి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాల వారికి అందిన నవరత్న పథకాల వివరాలతో ముద్రించిన బుక్‌లెట్లను అందజేశారు. నవరత్న పథకాల్లో తనకు వైఎస్సార్ ఆసరా కింద రూ.10,372, పింఛను కానుక ద్వారా రూ.62 వేలు, చేయూత రూ.37,500, డ్వాక్రా సున్నా వడ్డీ రూ.910 కలిపి రూ.1,10,782, ఇంటిస్థలం, పక్కాగృహం మంజూరైందని ఆ ప్రాంతానికి చెందిన నల్లనాగుల శేష బ్రహ్మానందం సంతోషం వ్యక్తంచేశారు. తనకు పింఛను కానుక రూ.82 వేలు, చేయూత రూ.37,500, డ్వాక్రా సున్నా వడ్డీ రూ.929, వైఎస్సార్ ఆసరా రూ.5,560 చొప్పున రూ.1,25,989 మేర లబ్ధి చేకూరిందని జయదేవి వివరించారు. ఈ పర్యటనలో మునిసిపల్ కో–ఆప్షన్ సభ్యులు మట్టా తులసీ, బేతపూడి రవి, పలు డివిజన్ల కార్పొరేటర్లు, ఆ డివిజన్ కన్వీనర్లు దార్ల చెన్నకేశవరావు, జవ్వాది రాంబాబు, నాయకులు షేక్ మొహమ్మద్‌సాహెబ్, గాజుల భగవాన్, పురంశెట్టి శ్రీనివాసరావు, సుంకర రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలను సాధించండి

కలెక్టర్ రంజిత్‌బాషా



వీడియోకాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ రంజిత్‌బాషా

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రీ–సర్వే, జగనన్న ఇళ్లు, స్పందన అర్జీలు తదితర అంశాలపై సమీక్ష చేశారు. కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ.. జిల్లా పురోగతిని వివరించడంతో పాటు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకుంటామని సీఎస్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.. 2022–23 సంవత్సరానికి రబీ సీజన్‌కు ఈ–క్రాప్ బుక్కింగ్ వేగవంతం చేయాలన్నారు. ఆరుతడి పంటలుగా వేసిన మినుముతో పాటు ఇతర పంటలను నమోదు చేయాలని వ్యవసాయాధికారులకు సూచించారు. పీఎం కిసాన్ ఈ–కేవైసీ చేయించుకునేందుకు ఈ నెల 15వ తేదీ వరకు అవకాశం కల్పించారన్నారు. ఈలోగా నూరు శాతం పూర్తయ్యేలా చూడాలని సూచించారు. జగనన్న లేఅవుట్లలో విద్యుత్, నీటి సరఫరా పూర్తి స్థాయిలో కల్పించాలన్నారు. ఉగాది నాటికి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల హాజరును నిత్యం అధికారులు తనిఖీ చేయాలన్నారు. గైర్హాజరైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రీ–సర్వే ప్రక్రియ పూర్తయిన గ్రామాల్లో భూహక్కు పత్రాల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి 128 సచివాలయాల్లో 614 పనులను అప్‌లోడ్ చేశామని తెలిపారు. ఆటిలో 596 పనులకు ఆమోదం లభించి, నిధులు మంజూరయ్యాయని వివరించారు. జేసీ అపరాజితసింగ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్ఈ ఈరాస్వామి, డీఆర్డీఏ పీడీ పి.ఎస్.ఆర్.ప్రసాద్, సర్వే ఏడీ గోపాలరాజా, సీపీఓ వై.శ్రీలత, డ్వామా పీడీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెడనలో మహిళా ఓటర్లే అధికం

పెడన: నియోజకవర్గ ఓటర్ల తుదిజాబితాను పెడన ఎన్నికల విభాగం అధికారులు గురువారం విడుదల చేశారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు చేర్పులు, మార్పులు చేసిన తరువాత తుది ఫొటో ఓటర్ల జాబితాను వెల్లడించారు. పెడన నియోజకవర్గంలో పెడన పట్టణంతో పాటు పెడన, బంటుమిల్లి, గూడూరు, కృత్తివెన్ను మండలాల్లో మొత్తం 1,60,696 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 79,695 మంది, మహిళలు 80,993 మంది, ఇతరులు ఎనిమిది మంది ఉన్నారు. పురుషులు కంటే మహిళలు 1,298 మంది అధికంగా ఉన్నారు. పెడన అర్బన్‌తో పాటు గూడూరు, బంటుమిల్లి మండలాల్లోనూ మహిళా ఓటర్లే పురుషుల కంటే అధికంగా ఉన్నారు. పెడన పట్టణంలో 25 పోలింగ్ స్టేషన్లలో పురుషులు 11,794 మంది, మహిళలు 12,699 మంది, మొత్తం 24,493 మంది ఉన్నారు. పెడన రూరల్‌లో 44 పోలింగ్ స్టేషన్లలో పురుషులు 13,420, మహిళలు 13,355, ఇతరులు ముగ్గురు, మొత్తం 26,778 మంది ఓటర్లు ఉన్నారు. గూడూరులో 56 పోలింగ్ స్టేషన్ల పరిధిలో పురుషులు 19,101, మహిళలు 19,531, ఇతరులు ముగ్గురు చొప్పున మొత్తం 38,635, బంటుమిల్లిలో 45 పోలింగ్ స్టేషన్లలో పురుషులు 17,250 మంది, మహిళలు 17,387 మంది, ఇతరులు ఒక్కరు చొప్పున మొత్తం 34,638 మంది ఓటర్లు ఉన్నారు. కృత్తివెన్నులో 46 పోలింగ్ స్టేషన్లలో పురుషులు 18,130, మహిళలు 18,021, ఇతరులు ఒకరు, మొత్తం 36,152 మంది ఓటర్లు ఉన్నారు. కృత్తివెన్నులో మాత్రం పురుషులే 109 మంది అధికంగా ఉన్నారు. నియోజకవర్గం మొత్తం మీద మహిళా ఓటర్లు కీలకం కానున్నారు.

బందరులో మహిళలదే ఆధిపత్యం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. జిల్లా ఎన్నికల విభాగం గురువారం ప్రకటించిన ఓటర్ల జాబితా ప్రకారం మచిలీపట్నం నియోజకవర్గంలో మొత్తం 1,87,957 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 90,876 మంది, మహిళలు 97,070 మంది, ఇతరులు 11 మంది ఉన్నారు. పురుషులకంటే 6,194 మంది మహిళలు అధికంగా ఉన్నారు. 2022 నవంబర్ ఎనిమిదో తేదీన విడుదల చేసిన ఓటర్ల జాబితాలో నియోజకవర్గంలో మొత్తం 1,92,010 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 93,287 మంది, మహిళలు 98,711 మంది, ఇతరులు 12 మంది ఉన్నారు. ముసాయిదా జాబితాకు, ప్రస్తుతం విడుదల చేసిన తుది జాబితాలో పురుషులు 2,411, మహిళలు 1641, ఇతరులు ఒక ఓటరు తగ్గారు. మొత్తం 4053 మంది ఓటర్లు తగ్గారు.

భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయండి



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా, జేసీ అపరాజితసింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ పి.ఎస్. ప్రద్యుమ్న ఆదేశించారు. అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లు, జాతీయ రహదారుల అధికారులతో ఆయన గురువారం మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రహదారుల నిర్మాణానికి నిధులు అందుబాటులో ఉన్నాయని ప్రద్యుమ్న తెలిపారు. భూసేకరణ, పరిహారం చెల్లింపును పూర్తి చేసి రహదారుల నిర్మాణాన్ని చేపట్టాలని సూచించారు. కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ జిల్లాలో ఎన్‌హెచ్–65, 16, 216 జాతీయ రహదారులు నిర్మాణం జరుగుతోందని పేర్కొన్నారు. వీటికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేశామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ అపరాజితసింగ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

వేగంకన్నా ప్రాణం మిన్న



కొమాళ్లపూడిలో నిర్వహించిన అవగాహన సమావేశంలో సీఐ, ఎస్‌ఐ తదితరులు

కృత్తివెన్ను: మితిమీరిన వేగంతో వాహనాలు నడిపేవారు తమ ప్రాణాలతో పాటు ఇంటి వద్ద ఉన్న కుటుంబాన్ని గుర్తుంచుకోవాలని బందరు రూరల్ సీఐ వీరప్రసన్నగౌడ్ సూచించారు. వేగం కన్నా ప్రాణం మిన్న అన్న విషయాన్ని గుర్తించుకోవాలని హితవుపలికారు. రోడ్డు సేఫ్టీ, సైబర్ క్రైమ్, మహిళలపై అరాచకాలు తదితర అంశాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ అన్ని అంశాలపై అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా యువత సరైన నడవడిక కలిగి మంచి భవిష్యత్తు కోసం ప్రయత్నించాలని సీఐ వీరప్రసన్నగౌడ్ సూచించారు. కొమాళ్లపూడి, నీలిపూడి, మాట్లాం గ్రామాల్లో ప్రజలకు వీటిపై అవగాహన కల్పించారు. మాజీ ఎంపీపీ సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీజి, కృత్తివెన్ను ఎస్‌ఐ గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

రైతులకు నష్టం జరగకుండా చర్యలు



వర్షం కారణంగా తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సునీల్‌బాబు

కోనేరుసెంటర్: రైతులు తమ ధాన్యాన్ని మిల్లర్లకు నేరుగా విక్రయించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందని తహసీల్దార్ డి.సునీల్‌బాబు తెలిపారు. వర్షం కారణంగా తడిసిన ధాన్యాన్ని పరిశీలించేందుకు ఆయన మండలంలోని పెదపట్నం గ్రామాన్ని గురువారం సందర్శించారు. స్థానిక నాయకులతో కలిసి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం రైతుభరోసాకేంద్రంలో రైతులతో సమావేశమయ్యారు. అకాల వర్షం కారణంగా రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ఆర్‌బీకేలతో పాటు మిల్లర్లకు కూడా విక్రయించే వెసులుబాటును ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతుల కోసం ఆర్‌బీకేల్లో గోనెసంచులు కావలసిన మేర అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మండల సర్వేయర్ గోవాడ రాజబాబు, రైతు భరోసా కేంద్రం సలహా మండలి చైర్మన్ గడిదేశి రాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్ పరిశీలన



మ్యాప్ పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ తదితరులు

కోనేరుసెంటర్: బందరు మండలం కరగ్రహారం గ్రామంలోని జగనన్న లేఅవుట్ పనులను ఇన్‌చార్జ్ హౌసింగ్ పీడీ జి.వి.సూర్యనారాయణ గురువారం పరిశీలించారు. ఈ లేఅవుట్‌లో రెండు బ్లాక్‌లకు సంబంధించిన పనులు మరో రెండు రోజుల్లో పూర్తి కానున్నట్లు ఆయన తెలిపారు. రోడ్లతో పాటు లేఅవుట్‌కు అవసరమైన విద్యుత్ సదుపాయాన్ని త్వరలోనే ఏర్పాటుచేస్తామని పంచాయతీ రాజ్, విద్యుత్‌శాఖ అధికారులు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కిట్టు, మునిసిపల్ కమిషనర్ చంద్రయ్య, తహసీల్దార్ డి.సునీల్‌బాబు, పంచాయతీ రాజ్ ఈఈ లక్ష్మీనారాయణ, ఏఈ జవహర్, ఎలక్ట్రికల్ ఏడీఈ రామకృష్ణ, ఏఈ సురేష్, కార్పొరేటర్‌లు పర్ణం సతీష్, పరింకాయల విజయ్, వేముల వనబాబు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతిని సంప్రదాయంగా నిర్వహించుకోవాలి

బందరు డీఎస్పీ మాసూంబాషా

కోనేరుసెంటర్: బందరు సబ్–డివిజన్ పరిధిలో పేకాట, కోడిపందేలతో పాటు ఇతరత్రా జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ మాసూంబాషా హెచ్చరించారు. ఆయన తన కార్యాలయంలో గురువారం విలేఖరులతో మాట్లాడారు. సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాని సూచించారు. సంస్కృతి, సంప్రదాయాల పేరుతో పేకాట, కోడిపందేలు, గుండాటలు నిర్వహించినా, ఆడినా చర్యలు తప్పవన్నారు. కోడి పందేలకు బరులు సిద్ధం చేసేందుకు ప్రయత్నించే వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారిని ముందస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ చేస్తామన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఈ నెలలో ఇప్పటి వరకు 27 కేసులు నమోదు చేసి 66 మందిని బైండోవర్ చేశామన్నారు. గతంలో బరులు నిర్వహించిన వారితోపాటు పేకాట, గుండాట నిర్వాహకులు, కోళ్లకు కత్తులు కట్టే వారిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. గత యేడాది జూదాలకు సంబంధించి 73 కేసులు నమోదు చేసి 158 మందిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. 70 కోళ్లు, 400 జతల కత్తులు, రూ.36 వేల నగదును స్వాధీనం చేసుకున్నామని వివరించారు. పేకాటకు సంబంధించి 63 కేసులు నమోదు చేసి 140 మంది జూదరులను పట్టుకున్నామని పేర్కొన్నారు. గ్రామాల్లో పేకాట, కోడిపందేలను అడ్డుకునేందుకు ప్రత్యేక టీంలను రంగంలోకి దింపుతామని ప్రకటించారు.

రోగులకు మెరుగైన సేవలు అందించండి



ఆస్పత్రిలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీపీ మధుసూదన్ రావు

గూడూరు: రోగులకు మెరుగైన సేవలు అందించే విషయంలో వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని గూడూరు ఎంపీపీ మధుసూదన్‌రావు సూచించారు. మండలంలోని మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా మెరుగైన వైద్య సేవలు అందించి, వారి మన్ననలను పొందాలని సూచించారు. ఆస్పత్రి అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ సుబ్బారావు, డాక్టర్ శివ రామకృష్ణ, రామన్నపేట పీఏసీఎస్ అధ్యక్షుడు మురాల వెంకటప్పయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో అన్న కూటోత్సవం



కోడూరు: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని కోడూరులోని శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి అమ్మవారికి గురువారం అన్న కూటోత్సవాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో తయారు చేసిన పులిహోర రాశిని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, మహిళలతో ధనుర్మాస వ్రతాన్ని ఆచరింపజేశారు. కుంకుమ పూజలు, తిరుప్పావై ప్రవచనాలను నిర్వహించారు. అనంతరం పాశుర నక్షత్ర హారతి కార్యక్రమాన్ని కనులపండువగా జరిపారు. ప్రధానార్చకుడు దుంభాల శ్రీధరాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించగా, ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సంక్రాంతికి జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

డీఎస్పీ మహబూబ్‌బాషా

అవనిగడ్డ: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలో ఎక్కడైనా జూద క్రీడలు ఆడినా, నిర్వహించినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మహబూబ్‌బాషా హెచ్చరించారు. ఆయన అవనిగడ్డలో గురువారం విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి పేరుతో కోడి పందేలు, పేకాట, చిత్తులాట ఇతర రకాల జూదం ఆడినా, నిర్వహించినా వారిపై చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. కుటుంబ సభ్యులంతా కలసి సంతోషంగా సంప్రదాయ క్రీడలు ఆడుకోవాలని, జూద క్రీడల జోలికి పోయి కేసులు, ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దని డీఎస్పీ సూచించారు. జిల్లా ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు సబ్ డివిజన్ పరిధిలో 55 మందిపై బైండోవర్ చేసినట్టు డీఎస్పీ చెప్పారు. మరికొందరిని బైండోవర్ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఎక్కడైనా జూదక్రీడలు జరిగితే 100కి లేదా సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చేవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ మహబూబ్‌బాషా హామీ ఇచ్చారు.

ఆవు కడుపులో 150 కిలోల వ్యర్థాలు



ఆవుకు శస్త్రచికిత్స చేస్తున్న వైద్యుడు రామయ్య



ఆవు పొట్టలో నుంచి తీసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

మచిలీపట్నంటౌన్: నగరంలో సంచరిస్తున్న ఆవులను ప్లాస్టిక్ వ్యర్థాలు కబళిస్తున్నాయి. ఆహార పదార్థాలను క్యారీబ్యాగుల్లో ఉంచి కొందరు రోడ్లపై పడేస్తున్నారు. వాటిని ఆవులు తినేస్తున్నాయి. ఫలితంగా అవి కడుపులో పేరుకుపోయి ఆవులు అనారోగ్యం బారినపడుతున్నాయి. ఇటీవల ఓ ఆవు అనారోగ్యానికి గురవడంతో కొంత మంది దానిని నగరంలోని గోసంఘానికి తరలించారు. ప్రభుత్వ పశువైద్యుడు రామయ్య ఆ ఆవుకు శస్త్రచికిత్స చేసి పొట్టలో నుంచి 150 కిలోల వ్యర్థాలను బయటకు తీశారు. ఈ వ్యర్థాల్లో ఎక్కువగా ప్లాస్టిక్ కవర్లు, తాళ్లు ఉన్నాయి.

క్యాలెండర్ ఆవిష్కరణ

చిలకలపూడి: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) విడుదల చేసిన క్యాలెండర్‌ను మచిలీపట్నం బార్ అసోసియేషన్ హాలులో గురువారం ఆవిష్కరించారు. ఐలు ప్రతినిధులు రావి వెంకట్రావు, వేము కోటేశ్వరరావు సమక్షంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల ప్రసాద్ ఈ క్యాలెండర్‌ను విడుదల చేశారు. ప్రసాద్ మాట్లాడుతూ.. న్యాయస్థానానికి సంబంధించిన వివరాలతో కూడిన ఈ క్యాలెండర్ న్యాయవాదులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి చీలి ముసలయ్య, న్యాయవాదులు శీతాల ప్రసాద్, బూరగడ్డ అశోక్, జి.వి.ఎల్.ఎన్.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో సామాజిక తనిఖీలు ప్రారంభం

మోపిదేవి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా గ్రామ స్థాయిలో సామాజిక తనిఖీలను ప్రారంభించినట్లు ఎంపీడీఓ పార్వతి తెలిపారు. మోపిదేవిలంకలో గురువారం పంచాయతీ పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులపై గ్రామ సభలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌పీ బి.శ్రీను మాట్లాడుతూ.. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పరిధిలో చేపట్టిన ఉపాధి పనులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లకు సంబంధించి కూడా క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించాలని సిబ్బందికి సూచించారు. సర్పంచ్ మోర్ల జ్యోత్స్న, ఎంఈఓ కె.రాజ్‌కుమార్, గ్రామ కార్యదర్శి త్రిపురసుందరి తదితరులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

మచిలీపట్నంటౌన్: మునిసిపల్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు త్వరలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) సూచించారు. నగరంలోని రుస్తుంబాద మునిసిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం న్యాయవాది శీతాల ప్రసాద్ సమకూర్చిన రూ.10 వేలతో పదోతరగతి విద్యార్థులకు జామెంట్రీబాక్సులను పేర్ని కిట్టు పంపిణీ చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వడ్డి జితేంద్ర, 44వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ మామిడిబత్తుల అజయ్, బందరుకోట ఉన్నత పాఠశాల హెచ్ఎం టి.వి.రఘుకాంత్ పాల్గొన్నారు.